‘వైఎస్సార్ చేదోడు’తో దర్జాగా..

ఎన్నో ఏళ్లుగా కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న దర్జీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటుతో కష్టాలకు చెక్ పడింది. గత నాలుగేళ్లుగా వరుసగా దర్జీలకు ‘వైఎస్సార్ చేదోడు’ పథకం ద్వారా ఆర్థికసాయం అందించి ఆదుకోవడంతో వారి బతుకుల్లో వెలుగులు నిండాయి.

- టైలర్లకు రూ.10 వేల సాయం అందిస్తూ ఆదుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న టైలర్లు




దుస్తులు కుడుతున్న మహిళా టైలర్లు(ఫైల్)

పాలసముద్రం : రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 2021 నుంచి జగనన్న చేదోడు పథకం ద్వారా అర్హులైన దర్జీల ఖాతాలో ఏడాదికి రూ.10 వేలు వంతున సర్కారు జమ చేస్తోంది. దీంతో జీవితాల్లో వెలుగులు నిండాయి. నాడు దర్జీ వృత్తి వదలి ఇతర పనులకు వెళ్లిన వారంతా మళ్లీ కుట్టు పనులు చేసుకుని, హాయిగా జీవనం సాగిస్తున్నారు. చేదోడు పథకం అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారు. పాలసముద్రం మండలంలో దర్జీలకు జగనన్న చేదోడు పథకం కింద ఏడాది 92 మందికి సాయం అందుతోంది. ఈ ఏడాది 113 మంది రూ.10 వేలు వంతున దర్జీలకు ఆర్థిక సాయం అందుకున్నారు.

దర్జీలను ఆదుకోవాలనే ఆలోచన వైఎస్సార్ సీపీదే

టైలరింగ్ వృత్తిని వదల్లేక, కొత్త వృత్తిని చేపట్టలేక దర్జీలు సతమతమవుతున్న తరుణంలో వైఎస్సార్ వారి జీవితాల్లో వెలుగులను ప్రసాదించేందుకు 2009 మార్చి ఒకటో తేదీన జీఓ ఎంఎస్ నంబర్ 86 విడుదల చేశారు. చెన్నై, కేరళ ప్రభుత్వాల తరహాలో రాష్ట్రంలో కూడా దర్జీలకు సదుపాయాలు అందజేయాలని ఆకాంక్షించారు. 2009 మే14న రాష్ట్ర ప్రభుత్వం 28బీ, 12008–2 ద్వారా ఆంధ్రప్రదేశ్ దర్జీలను కో–ఆపరేషన్ సొసైటీ ఫెడరేషన్‌గా ప్రతిపాదించింది. దీంతో రాష్ట్రంలోని దర్జీలకు ప్రయోజనం చేకూరుతుందని తలిచి వైఎస్సార్ పారిశ్రామిక ఫెడరేషన్ ఏర్పాటుకు ఆదేశించారు. జీఓ జారీ చేసిన తరువాత రూ.కోటి నిధులు కూడా కేటాయించారు. అయితే వైఎస్సార్ మరణాంతరం ప్రభుత్వాలు చేనేత, జౌళిశాఖకు నిధులు కేటాయించక పోవడంతో దర్జీల పరిస్థితుల్లో మార్పు కనిపించలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వైఎస్సార్ పథకం ద్వారా దర్జీల ఖాతాల్లో రూ.10 వేలు ఏటా జమ చేస్తూ జీవితాల్లో వెలుగు నింపారు.

ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు

2013 ఎన్నికల ముందు నాటి వైఎస్సార్ ప్రభుత్వం రూ.కోటితో హైదరాబాద్‌లో ఫెడరేషన్ కార్యాలయాన్ని ప్రారంభించినా, దాన్ని టీడీపీ ప్రభుత్వం రద్దు చేసిందని దర్జీలు వాపోతున్నారు. తమ బాధలను అర్థం చేసుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే ఆయనకు ఎల్లప్పుడూ టైలర్లు రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఆర్థికంగా వెసులుబాట



ఎంతోమంది దర్జీ వృత్తిని మానేయలేక, వేరే వృత్తి చేయలేక అందులోనే కొట్టుమిట్టాడుతున్నాం. చేతినిండా పనిలేక ఖాళీగా ఉంటున్న తరుణంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాకు వైఎస్సార్ చేదోడు పథకం ద్వారా మమ్మల్ని ఆదుకుంటున్నారు.

– ఆర్ముగం, టైలర్, పాలసముద్రం

మా కుటుంబాల్లో వెలుగులు



దర్జీల కష్టాలను గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తొలి బడ్జెట్‌లోనే మా సంక్షేమానికి నిధులు కేటాయించడం హర్షణీయం. మా బాధలను గుర్తించిన మొట్టమొదటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన చరిత్రలో నిలిచిపోతారు. తద్వారా అనేకమంది దర్జీల కుటుంబాలలో వెలుగు నింపారు.

– జాన్‌బాషా, వీఆర్ కుప్పం, టైలర్

రెడీమేడ్ దుస్తులతో పని తగ్గింది..



మార్కెట్‌లోకి రెడీమేడ్ దుస్తులు రావడంతో టైలరింగ్ పనికి డిమాండ్ తగ్గింది. కుటుంబ పోషణ కష్టమవుతోంది. ఎంతోకాలం ఇదేవృత్తిలో ఉండడంతో వేరే పని చేయలేక కష్టపడుతున్నాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే టైలర్లకు ఏటా రూ.10 వేలు ఆర్థికసాయంతో ఉపయోగకరం.

– ఆర్.గౌతమి, కన్నికాపురం, టైలర్

అర్హులైన టైలర్లకు జగనన్న చేదోడు



మండలంలో చాలా రోజులుగా కష్టాల్లో ఉన్న టైలర్లకు ప్రభుత్వం వారిపై దృష్టి సారించి అర్హులైన ప్రతి టైలర్లకు జగనన్న చేదోడు పథకం కింద రూ.10 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. అందువల్ల మండల పరిధిలో అర్హులైన ప్రతి టైలర్లకు జగనన్న చేదోడు వచ్చేలా సచివాలయంలో ఆన్‌లైన్ చేస్తున్నాం. – రామనాథరెడ్డి, ఎంపీడీఓ

సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



రోగులను పరీక్షిస్తున్న జిల్లా జగనన్న నోడల్ అధికారి డాక్టర్ రవిరాజు

శ్రీరంగరాజపురం: సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ప్రధాన లక్ష్యం అని జిల్లా జగనన్న నోడల్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మంగళవారం మండలంలోని పుల్లూరు సచివాలయ పరిధిలోని గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా రోగులకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రతి ఇంటినీ ప్రతి కుటుంబాన్ని జల్లెడలా పట్టి ప్రతి ఇంటి గడప వద్దకే ప్రజలకు ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, ఒక్క రూపాయి కూడా భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడం కోసం ప్రవేశపెట్టిన పథకం జగనన్న ఆరోగ్య సురక్ష అని అన్నారు. ఈ పథకం రోగులకు ఎంతగానో ఉపయోగడుతోందని, గతంలో ప్రభుత్వం కూడా పేద ప్రజలు గురించి ఆలోచించలేదని అన్నారు. వచ్చే రోగులకు వైద్యులు పూర్తిస్థాయిలో పరీక్షించి మందులను ఉచితంగా అందించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 496 మంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అర్హులైన 35 మందికి కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎంపీడీఓ మోహన్ మురళి, డాక్టర్ సందీప్‌రాజు, గిరి, లక్ష్మీపతి, మురళీకృష్ణ, ఏఓ కృషయ్య, ఎంపీటీసీ చంద్రశేఖర్, సర్పంచ్ భవ్య, కుమారి, నాయకులు జనార్దన్, బాబు, వెంకటేష్, ప్రమీళ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వేలం

పుత్తూరు: స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు కూరగాయల మార్కెట్, ప్రైవేటు బస్టాండు, జంతువధశాలకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించు వేలంపాటలో పాల్గొనేవారు గెజిట్ 90/2024 నియమ నిబంధనలు, షరతులకు లోబడి పాల్గొనాలని సూచించారు. వేలం నెగ్గిన వారు పురపాలక సంఘం నిబంధనలకు మేరకు రుసుం వసూలు చేయాల్సి ఉంటుందన్నారు.

జాతీయ లోక్‌అదాలత్ మార్చి 16కు మార్పు



జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: మార్చి 9న నిర్వహించాల్సి ఉన్న జాతీయ లోక్‌అదాలత్‌ను మార్చి 16వ తేదీకి మార్పు చేసినట్లు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి, ఇతర సెలవుల నేపథ్యంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ లోక్‌అదాలత్ నిర్వహణ తేదీని మార్పు చేసినట్లు వెల్లడించారు. న్యాయవాదులు, పోలీసులు తమ కక్షిదారులకు తేదీ మార్పు విషయాన్ని తెలియజేయాలని సూచించారు. మార్చి 16న స్థానిక సబ్‌కోర్టులో నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో పెద్దసంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

నేడు చేపల చెరువుల వేలం

వెదురుకుప్పం: మండలంలోని పాతగుంట పంచాయతీలో ఉన్న చెరువులను చేపల పెంపకం కోసం వేలం వేస్తున్నట్లు స్థానిక సర్పంచ్ భువనేశ్వరి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలోని పాతగుంట చెరువు, ఉప్పరపల్లె చెరువు, నారాయణ, ముత్యాలనాయుడు చెరువుల్లో చేపల పెంపకం కోసం బుధవారం 10 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు రూ.3 వేలు డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

సచివాలయ కన్వీనర్‌కు ఆర్థిక సాయం



శివశంకర్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: రూరల్ మండలంలోని కేబీఆర్ పురం సచివాలయ కన్వీనర్ శివశంకర్‌కు పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి మంగళవారం రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు. శివశంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. శివశంకర్‌ను పరామర్శించిన రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆర్థిక సాయాన్ని అందజేశారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

నింద్ర: మండలంలోని వైఎస్ కండ్రిగ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈఓ శ్రీధర్ రాజు తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు వివరాలు, పాఠ్యాంశాల బోధనపై విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం సరిగా పెడుతున్నారా ? లేదా అని ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పరిశీలన



సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

నగరి : మున్సిపల్ పరిధిలోని సత్రవాడ శివార్లలో ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకును మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ మంగళవారం పరిశీలించారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో సరఫరాకు తగిన మేర నీటి నిల్వలు ఉన్నాయా ? అనే అంశాన్ని ఆయన ఆరాతీశారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి వచ్చే నీటిని శుద్ధీకరించి సరఫరా చేసే ప్లాంటు పనితీరుపై మున్సిపల్ డీఈని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా పథక రచన చేసుకోవాలని ఇంజినీరింగ్ విభాగపు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈలు రమేష్, నవీన్ పాల్గొన్నారు.

టైలర్స్ డేకి ఆహ్వానం

పుత్తూరు: పట్టణంలో బుధవారం నిర్వహించే టైలర్స్ డే కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డిని పుత్తూరు టైలర్స్ సంఘ సభ్యులు ఆహ్వానించారు.

7 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రతాప్‌స్వామి

వెదురుకుప్పం: మండలంలోని ఎగువ కన్నికాపురం సమీపంలోని శ్రీమరకతవల్లీ సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో మార్చి 7వ తేదీ నుంచి మహా శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్‌స్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆలయ ఆవరణలో ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రతాప్ స్వామి మాట్లాడుతూ మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలకు సంబంధించి 7న ధ్వజారోహణం, రుద్రహోమం, 8న స్వామివార్ల కల్యాణోత్సవం, అభిషేకాలు, విశేష పూజలు చేస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాలకు నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులకు అన్నదానంతో పాటు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు మండలంలోని భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు గణపతిరెడ్డి, దయాకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

పుత్తూరు ఆస్పత్రిలో సౌకర్యాలు భేష్



క్యాజువాలిటీని పరిశీలిస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్ రమాదేవి

పుత్తూరు: పుత్తూరు పట్టణంలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి నిర్వహణ, రోగులకు అందుతున్న సౌకర్యాల పట్ల క్వాలిటీ అసెస్‌మెంట్ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమాదేవి సంతృప్తి వ్యక్తం చేశారు. కాయకల్ప ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం సాయంత్రం పుత్తూరు ఆస్పత్రిని రాష్ట్ర అధికారుల బృందం తనిఖీ చేసింది. ఆస్పత్రిలో ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. క్యాజువాలిటీలో అందుతున్న సౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ రాష్ట్ర కన్సల్టెంట్ కె.రాజ్‌కిరణ్, జిల్లా ఎన్ఎస్ఆర్ హరికృష్ణ, స్థానిక వైద్యాధికారి డాక్టర్ జి.కృష్ణకాంత్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

‘మేము సిద్ధం-మా బూత్ సిద్ధం’కు నగరి నేతలు



మేము సిద్ధం- మా బూత్ సిద్ధం సమావేశంలో పాల్గొన్న మండల, మున్సిపల్, జేసీఎస్ అధ్యక్షులు

నగరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో నిర్వహించే ‘మేము సిద్ధం- మా బూత్ సిద్ధం’ సమావేశానికి నగరి నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున తరలివెళ్లారు. వడమాలపేట, పుత్తూరు, నగరి, నింద్ర, విజయపురం రూరల్ మండలాలు, పుత్తూరు, నగరి మున్సిపాలిటీల నుంచి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మండల జేసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు. రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా కలిసి వారు సమావేశంలో పాల్గొన్నారు.

రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు



మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నగరి : నాడు–నేడు పథకంలో ఆధునీకరించిన మండలంలోని ఎం.కొత్తూరు పాఠశాలలో మరిన్ని అభివృద్ధి పనులకు పీఎంశ్రీ పథకంలో రూ.15 లక్షలు మంజూరైంది. ఈ నిధులతో పాఠశాల మైదానం, సైన్స్ ల్యాబ్ తదితర పనులు జరగనున్నాయి. మంగళవారం సంబంధిత పనుల విషయమై సర్వశిక్షా అభియాన్ డీఈ మధుసూదన రావు, ఏఈ నాగభూషణం పాఠశాలకు విచ్చేసి మైదానాలను పరిశీలించారు. మంజూరైన నిధులతో త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ నమశ్శివాయం, హెచ్ఎం హిమవతి, పీఈటీ వేలు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే దేశాభివృద్ధి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

పాలసముద్రం : దేశ ప్రధాని నరేంద్రమోదీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందిందని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ రాపూరి వెంకటేశులు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. సోమవారం పాలసముద్రంలో భారతీయ జనతా పార్టీ నాయకులతో కలసి ప్రజాపోరు కార్యక్రమం జరిగింది. కిసాన్ మోర్చా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. దేశం అభివృద్ధి పథకంలో నడవాలంటే మళ్లీ నరేంద్రమోదీ ప్రధానమంత్రి చేయాలని తెలిపారు. అనంతరం ప్రజాపోరు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీడీనెల్లూరు అసెంబ్లీ కన్వీనర్ రాజేంద్రన్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు బాలయ్య, బాలసుబ్రమణ్యం, చోళ, మురళీరాజు తదితరులు పాల్గొన్నారు.

పచ్చాలమ్మ దేవతకు పొంగళ్లు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామదేవత శ్రీ పచ్చాలమ్మ దేవతకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకం అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. ట్రస్టు బోర్డు చైర్మన్ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

నాగలాపురం: నాగలాపురం బైపాస్ సమీపంలో శ్రీచెల్లేతమ్మ ఆలయం వద్ద మంగళవారం చెట్టును కారు ఢీకొంది. స్థానికుల కథనం మేరకు.. నాగలాపురం నుంచి తిరుపతి వెళుతున్న కారు రోడ్డుకు అడ్డంగా వచ్చిన ఆవును తప్పించబోయి అదుపుతప్పి చెట్టును ఢీకొంది. కారు ముందు భాగం పాక్షికంగా దెబ్బతినింది. కారు నడుపుతున్న భాస్కర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

ఎస్వీయూ అభివృద్ధే ధ్యేయం

తిరుపతి సిటీ: ఎస్వీయూ అభివృద్ధే లక్ష్యంగా పలు అంశాలపై పాలక మండలి నిర్ణయాలు తీసుకున్నట్లు రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం వర్సిటీ వీసీ చాంబర్‌లో వీసీ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పాలక మండలి సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్టు వెల్లడించారు. సమావేశంలో అమరావతి నుంచి ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, ఉన్నత విద్యాశాఖ, ఆర్థిక శాఖ ముఖ్య అధికారు లు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. పాలకమండలి సభ్యులు సుగుణమ్మ, డాక్టర్ సురేంద్రనాథ్‌రెడ్డి, సుమకిరణ్, మంజుల, మొహినుద్దీన్ బాషా, డాక్టర్ సుధారాణి, పద్మనాభం, నారాయణ బాబు, జ్యోతి పాల్గొన్నారు.

పాలకమండలి నిర్ణయాలు

- 53 మంది బోధన సిబ్బందికి ప్రొఫెసర్లుగా, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి.
- బోధనేతర సిబ్బంది వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఆమోదం.
- నూతన భవన నిర్మాణాలు, మరమ్మతులు, ఇంజినీరింగ్ పనులకు ఆమోదం.
- వర్సిటీలో విద్యార్థుల భవిష్యత్ కోసం సరికొత్త కోర్సులకు పాలకమండలి ఆమోదం.
- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వర్సిటీ ఆధ్వర్యంలో గోల్డ్‌మెడల్.

1 నుంచి స్విమ్స్‌లో నగదు రహిత వైద్య సేవలు

తిరుపతి తుడా: స్విమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీపద్మావతి జనరల్ ఆసుపత్రిలో మార్చి 1వ తేదీ నుంచి నగదు రహిత వైద్య సేవలను అందించనున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఆసుపత్రిలో మూడు దశాబ్దాలుగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను తక్కువ ఖర్చుతో నాణ్యంగా అందించామన్నారు. అనుబంధంగా ఇటీవల శ్రీపద్మావతి జనరల్ ఆసుపత్రిని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు సాధారణ ఫీజులను వసూలు చేస్తూ వచ్చామన్నారు. మరింత మంది రోగులకు ఉచితంగా వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతో టీటీడీ బోర్డు సోమవారం ఆసుపత్రిపై కీలక నిర్ణయం తీసుకుందన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ ఆంజనేయులు శెట్టి

గంగాధరనెల్లూరు: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో ఎటువంటి అవకతవకలు జరగకూడదని నాణ్యమైన శుచి, శుభ్రమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ ఆంజనేయులు శెట్టి అన్నారు. మండలంలోని బాలగంగానపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు, హాజరు పట్టికను పరిశీలించి, చాలా బాగుందని అభినందించారు. అదేవిధంగా పదో తరగతి విద్యార్థులతో మమేకమై త్వరలో జరిగే పబ్లిక్ పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలి ?పరీక్ష హాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు విషయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూసి బాగుందని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సంపత్, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీబిడ్డల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లు అందజేస్తున్న సర్పంచ్, వైస్ ఎంపీపీ

పాలసముద్రం : గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దనే పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైస్ ఎంపీపీ పుష్ప, సర్పంచ్ లిల్లీ తెలిపారు. సోమవారం వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ఇందిర సమక్షంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం మంచి పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే శిశు మరణాలు జరగవన్నారు. అందువల్ల ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్న పోషకాహారాన్ని సక్రమంగా అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వారి చేతుల మీదుగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ దీప, సుమిత్ర పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు



మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : అప్పుడే పుట్టిన బిడ్డ మొదలు ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని ఎంఈఓ గిరిజ, ఏఓ విద్యావతి తెలిపారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులకు వైద్యాధికారి మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో సామూహిక పల్స్ పోలియో కార్యక్రమంపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3వ తేదీ జరగనున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. మండల పరిధిలోని 0–5 ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసి అంగవైకల్యం రాకుండా కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మండలంలో 0–5 ఏళ్లలోపు 2767 మంది పిల్లలు ఉన్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, సుశీల పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో రాహు కేతు పూజలు



మయూర వాహనంపై సుబ్రమణ్యస్వామి

రామకుప్పం: మండల కేంద్రానికి సమీపంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం రాహు కేతు మండపంలో రాహు కేతు పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కర్ణాటక భక్తులు సుబ్రమణ్య స్వామి వారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. సుబ్రమణ్యస్వామి వళ్లీదేవసేన సమేతుడై మయూర వాహనంపై ఆశీనులై ఆలయ మాడవీధుల్లో విహరించారు. సాయంత్రం భక్తులు స్వామివారికి కావడులు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

కేంద్ర బలగాలకు వసతి ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

తిరుపతి క్రైమ్: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించే కేంద్ర సాయుధ బలగాలకు ఎస్వీయూ హెచ్ బ్లాక్‌లో కల్పిస్తున్న వసతి ఏర్పాట్లను మంగళవారం జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ పరిశీలించారు. ఎన్నికలు ముగిసే వరకు సాయుధ బలగాలకు వసతి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

పంటల పరిశీలన

నింద్ర: వరి, వేరుశనగ పంటలను ఆశించే చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. మంగళవారం మండలంలోని ఎలకాటూరు గ్రామంలో వేరుశనగ, వరి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ చర్యల్లో భాగంగా మందులను పిచికారీ చేయాలని కోరారు. వేరుశనగ పంటను ఆశించే పచ్చపురుగు, లద్దె పురుగుల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.